కథ

# సిన్నోడి సేద్యం

- యిమ్మడిశెట్టి కోటేశ్వర్రావ్

తొలకరి జల్లులు మొదలయ్యాయి. నిన్నటి వరకు వడగాడ్పులకు ఎక్కడికో పారిపోయిన పచ్చదనం మళ్లీ అక్కడక్కడ తొంగి చూస్తోంది.

"ఇయ్యాల్నించి అరక కట్టాల. ఈ వానలకు గాబుగడ్డి మోసులు పెట్టిందంటే, ఆనక దాన్ని అడ్డుకోడం మాలావు కట్టం." ఆలోచిస్తూనే బక్క చిక్కిన దున్న కుర్రలకు కుడితి పెట్టాడు సిన్నోడు.

సిన్నోడంటే నిజంగా 'చిన్నోడు' కాడు. అతడి వయసు యాభైకి పైమాటే! వాళ్ల నాన్న 'వెంకటసుబ్బయ్య' అని పెట్టిన పేరుని, వాళ్లమ్మ 'సిన్నోడా' అని ముద్దుగా పిలిచిన పేరు మింగేసి నాలుగు పుష్కరాలు దాటింది. ప్రస్తుతం సిన్నోడిని ఎవరైనా 'వెంకటసుబ్బయ్యా' అని పిలిస్తే, వాళ్లు తన వెనక ఎవరినైనా పిలుస్తున్నారా? అని గబుక్కున వెనక్కి తిరుగుతాడు.

ఎప్పుడూ మోకాళ్లపైకి కట్టిన పంచెకట్టు, వల్లెవాటు వేసుకున్న ముతక కండువా, గుబురు మీస కట్టుతో కనబడే సిన్నోడు, చొక్కా తొడిగితే అది చోద్యమే మరి!

దున్నకుర్రల మెడపై కాడి ఆనించి మెడ చుట్టూ పట్టెడలను బిగించాడతను. కాడిపై నాగటి దుంప తిప్పేసి, చెర్నకోల కోసం ఇంట్లోకి అడుగు పెట్టిన సిన్నోడి కంట్లో, మూలనున్న గంప పక్క కుదురుగా కూర్చుని పొదుగుతున్న కోడిపెట్ట కన్పించింది.

"ఓయమ్మే! పెట్ట మెల్లో బుర్ర టొక్కు కట్టమని ఎన్నాళ్లయింది నీకు జెప్పి?" అంటూ ఇంట్లో జైదులు విసురుతున్న పెళ్లాంపై విసురుకుని, గంప పక్క కోడిపెట్ట కాళ్లు ఒడిసిపట్టి లాగాడతను. అసలే పొదుగు కొచ్చిన కోడిపెట్ట, ఒళ్లంతా గంపెడు చేసి 'కేర్... కేర్' మని అరవడం ప్రారంభించింది.

"దీనెవ్వ! కారుకి రెండు గుడ్లు పెట్టిందంటే చాలు. రెన్నెళ్లు మూల కూకోని పొదిగిద్ది." తనకి తానే చెప్పుకుంటూ తేగల పాతర దగ్గర ఎండిపోయిన తాటి బుర్రని వెదకి పట్టి నులకతాడుతో కోడిపెట్ట మెడలో బిగించాడు. తాటిబుర్ర, మెడకి బరువుగా తగలడంతో బ్యాలన్సుచాలని కోడిపెట్ట వెనక్కి నక్కి పరుగులు తీయడం ప్రారంభించింది.

"ఇహ పొదుగు పొదుగెహె!" అని కోడిపెట్టని రెండు గజాల దూరం వరకు తరిమి కొట్టి, చూరులోనున్న చెర్నకోలని భుజంపై వేసుకుని పంచ దాటిన సిన్నోడిని చూసిన దున్నకుర్రలు, ఒక్కసారిగా పంటకాలువలోకి కొత్తనీరు దూకినట్లు పరుగు లంకించుకున్నాయి.

కాసేపట్లో ఏడెకరాల దిబ్బ చేరుకున్న సిన్నోడు నాగలి కట్టి, "హుర్ర్ర్.. ఛోః ఛోః" అంటూ దున్నల్ని అదిలించసాగాడు. నాగటి సాళ్లలోంచి బయట పడిన పురుగుల కోసం గోరింకలు, పాలపిట్టలు గుంపులు గుంపులుగా వచ్చి వాలాయి. గోరింకల్ని చూడగానే సిన్నోడి మనసు నలభై ఏళ్లు వెనక్కి పోయింది. అతడు యాంత్రికంగా దున్నల వెంట నడుస్తూ అదిలిస్తున్నాడన్న మాటే గానీ... బాగా ముగ్గిన తాటిపండు నేల మీద 'దప్పున' పడ్డట్టు, అతని మనసు ఒక్కసారిగా గతంలోకి దూకేసింది.

తనకిప్పటికీ గుర్తే! తన చిన్నప్పుడు ఈ ఏడెకరాల దిబ్బంతా తమ కిందే వుండేది. ఆ రోజుల్లో పంటకాలువ లేదు. వానలు మొదలవుతాయనగా, ఏడెకరాల దిబ్బంతా పది నాగళ్ళను పెట్టించి దున్నించేవాడు తాత. ఆ తర్వాత జడివానలు కురవడంతో గడ్డి అంతా మురిగి, చేను మంచి పదునుకొచ్చేది. అదనుచూసి మరోసారి చేనుని దున్నించడం జరిగేది. అప్పుడే గుంపులు గుంపులుగా గోరింకలు, పాలపిట్టలు వచ్చి వాలేవి.

పోలేరమ్మని తలచుకుని పొదుల్లో సరివి మొక్కలు నాటించేవాడు తాత. నాలుగోఏడు తిరిగొచ్చేసరికి నవనవ లాడుతూ తోట కోత కొచ్చేది. ఈలోపు గుంటూరు నుంచి బ్రోకర్లపై బ్రోకర్లు బేరాలకొచ్చి పడేవాళ్లు. అలా చేర్చిన డబ్బుతోనే ఏడెకరాలని పన్నెండెకరాలు చేసి పైకి పోయాడాముసలాడు. తాత పోయింతర్వాత 'అయ్య' హయాం వచ్చింది. కల్లు, సారాలంటూ పన్నెండెకరాలని ఎకరం ముప్పాతికగా కుదించి దొంగసారా దొంగతనంగా తాగి కైలాసం చేరుకున్నాడాయన.

ఇక, తన హయాం వచ్చేసరికి మూడు సెంట్ల ఇళ్ళ చోటు, ఇప్పటికీ అందరిచే 'ఏడెకరాల దిబ్బ' అని పిలువబడే ఎకరం ముప్పాతిక తప్ప ఏం మిగలలేదు. ఈ ఎకరం ముప్పాతికలోనే తను రేయింబవళ్లు దొర్లుతూ, పొయ్యిలో పిల్లి పడుకునే అవసరం లేకుండా చేస్తున్నాడు.

పేగు మాడకుండా పొలం కాపాడినా, పిల్లల చదువులకోసం ఇతరుల పొలాల్లోకి కూలికి, నాలికి వెళ్లక తప్పలేదు. ఎలాగైతేనేం, పెద్దోడు డిగ్రీ పాసయ్యాననిపించాడు. చిన్న కొడుకు ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కూతుర్ని 'గంతకు తగ్గ బొంత' అంటూ తన స్థాయికి తగిన సంబంధాన్ని ఖాయం చేసుకుని పెళ్ళి జరిపించాడు.

"యాందిరా సిన్నోడా! మేలుకునే దున్నుతన్నావా? పాము మెలికలు తిరిగినట్టు ఆ నాగటి సాలేందిరా." సింహగర్జన లాంటి నాయుడమ్మ మావ అదిలింపుతో ఇహలోకంలోకి వచ్చిపడ్డాడు సిన్నోడు. నాయుడమ్మ మావ కూడా తన లాంటి బతికిచెడ్డ రైతే. అవసరానికి ఆపద్బాంధవుడిలా ఆదుకునే నాయుడమ్మ మావ అంటే ఊర్లో అందరికీ భక్తి ప్రపత్తులే.

"యాంది మావ! ఏళగానేళ ఇట్టా బైదెల్లినావ్?" సిన్నోడు నాగటి మేడిని పైకెత్తి దుంపలో చిక్కుకున్న గడ్డిని చెర్నకోలతో బయటికి తోసాడు.

"ఆఁ మా ముర్రగుంట పొలాన్ని ఓపాలి చూసొద్దామని.. అవున్రోరా! నీకీ సంగతి తెలుసా?" సిన్నోడి వైపు చూస్తూ అడిగాడు నాయుడమ్మ మావ.

"ఏ సంగతి మావా?"

"ఎంకడు పొలం అమ్మేసేడంటగా?!"

"యాంది మావా?!" సిన్నోడు ఒక్కసారిగా దున్నల పగ్గాలని గట్టిగా లాగి పట్టి, ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"ఓర్నీ, కడుపు సల్లంగుండ. ఎంకడి పొలం పక్క పొలం గల్లోడివి. నీకే సంగతి తెలవదంటూరా? ఆడెవడో అవిద్రాబాదు నుంచొచ్చాడంట. ఈ పొలాలన్నీ కొని ఇక్కడ ఓ పెద్ద ఊరు కట్టిత్తాడంట. మన రమణయ్య, వీరన్నలు కూడా పొలాల్ని బేరానికి పెట్టారంట. రోడ్డంట పొలాలు కలిగి వుంటం మీ అద్దుట్టంరా. ఆ పట్నపోడు పొలాలకి మంచి రేటే పెడ్తున్నాడంట. నువ్వు కూడా ఎంతకాలం ఈ మట్టిలో పొర్లాడుతావ్? సుబ్బరంగా పొలాన్ని అమ్మేసి ఆ డబ్బంతా ఫిక్కుడులో (ఫిక్సడ్ డిపాజిట్) ఏసి, కాలు మీద కాలేసుకుని, నోట్లో ఏలేసుకుని కూకోరాదూ..."

సిన్నోడు చేష్టలుడిగి అలానే నిల్చుండి పోయాడు.

"మరి నేను ముర్రగుంట పొలం దాకా వెళ్లొత్తారా." అంటూ ఆ వైపు సాగిపోయాడు నాయుడమ్మ మావ.


"ఈ ఆయకట్టులో ఎంకయ్య, రమణయ్య, వీరన్నలే మోతుబరి రైతులు. వాళ్లే పొలాల్ని బేరానికి పెట్టింతర్వాత తన బోటోడు ఎంత మాత్రం!? అసలు తన పొలానికి నీళ్లొచ్చేదే ఎంకయ్య పొలం లోంచి. ఇక, తన పొలానికి నీళ్ళెట్టా? ఆ పట్నపోడు పొలాలన్నీ ఇళ్ళు సేసేస్తే, ఆ ఇళ్ళ మద్దెన తనెట్టా ఎగసాయం సేత్తాడు?" ముసురుతున్న ఈగల్లా ఆలోచనలు మెదడుని చుట్టేస్తుంటే, నాలుగంగల్లో నట్టిల్లు చేరుకుని కుక్కి మంచంలో కూలబడ్డాడతను.

❄ ❄ ❄ ❄ ❄

కాలువకి గండిపడి నీళ్ళు పార్లిపోతున్నట్టు, కాలానికి గండిపడి రోజులు దొర్లిపోతున్నాయి.

దుక్కి పని ముగియడంతో ఈమధ్య సిన్నోడు ఇంటిపట్టునే వుంటున్నాడు. అలాంటి రోజుల్లో ఓ రోజు, సిన్నోడు పంచ ముందు కూర్చుని, తాటి నారతో చేంతాడు పేనుతూ, తన రెండో కొడుకుని దున్న కుర్రలకు కుడితి పెట్టమని పురమాయించాడు.

దున్నకుర్రలకు కుడితి పెట్టి, పలుపు తాళ్లతో కట్టు కొయ్యలకు కట్టేసి గడ్డివామిలోంచి ఓ మోపెడు ఎండుగడ్డి తెచ్చి వాటి ముందు పడేసిన సిన్నోడి చిన్న కొడుక్కి వాకిట్లోకి వీరన్నతో పాటు ఓ కొత్త మనిషి రావడం కన్పించింది.



కొత్త మనిషి చూడ్డానికి హుందాగా, దర్జాగా వున్నాడు.

"ఓ నాన్నోవ్‌. వీరన్న బాబాయ్ వొచ్చాడు. ఎవుళ్లో కొత్త మడిసి కూడా వొచ్చాడు." అంటూ ఇంట్లోకి ఆదరా బాదరాగా వెళ్లి, ఇంట్లో వున్న రెండు ముక్కాలి పీటలను తెచ్చి, వాటిని కండువాతో దులిపి వచ్చిన వాళ్లని ఆసీనులవమని వినయంగా చెప్పాడు సిన్నోడి చిన్నకొడుకు. వచ్చిన వాళ్లు అదేమీ పట్టనట్లు నిల బడే మాట్లాడ్డం ప్రారంభించారు.

"ఏం లేదన్నా. ఈ బాబుగోరు మన పొలాల్లో ఓ మంచి ఊరు కట్టిత్తాడంట. మన డొంకబాటలో తారురోడ్డు పోపిత్తానని, బస్సు కూడా రప్పిత్తానని సెబుతున్నాడు. ఇంకా ఎన్నో గొప్ప గొప్ప ఇసయకాలు సెబుతున్నాడు ఈ బాబు. మన పొలాల్నేం ఉత్తినే ఎత్తుకు పోవడం లేదులే. ఇక్కడ మారుకేటు రేటుకంటే రెట్టింపిత్తన్నాడు. అందుకే మా పొలాలన్నీ ఇచ్చేసినాం. నీ పొల మేమో కంచంలో బువ్వలాగుండే. ఆనక మీ ఇట్టం." అంటూ గుక్క తిప్పుకోకుండా చెప్పాడు వీరన్న.

"అయితే పొలాలన్నింటిని ఊరుగా మార్చేస్తానన్న పట్నపోడు ఈయనే గావాల్న!" సిన్నోడు పరిస్థితిని కొంచెం కొంచెం అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"కాన్వెంటు కూడా పెడ్తున్నా మండీ. మీ పిల్లలు చక్కగా నాలుగు ఇంగ్లీష్ అక్షరాలు నేర్చుకుంటారు." సర్దుకుంటూ చెప్పాడు 'పట్నపోడు' అని ఆ ఊరి వాళ్లతో పిలువబడు తోన్న ప్రభాకర్.

"నా పిల్లగోల్లు కాన్వెంటు సదువుని దాటొచ్చేసారయ్యా." అని సిన్నోడు జవాబివ్వడంతో ఇబ్బం దిగా కదిలాడు ప్రభాకర్.

"ఏందన్నా? అసలు ఇసయం జెప్పు. నానుడు బేరం ఎందుకు? సారూ... ఓ వంద రూపాయలు ఇలా పడెయ్యండి." అని ప్రభాకర్ దగ్గర్నుంచి వంద తీసుకుని, "అన్నా! రేటు దేముంది గానీ ముందు ఈ బయానా తీసుకో." అంటూ సిన్నోడి చేతిలో పెట్టబోయాడు వీరన్న.

"నేను పొలం అమ్మదలసుకో లేదు."

"ఓర్నీ మడిసి పాడుగాను! ముంగిట్లోకి లచ్చిందేవి వొచ్చి కూకుంటే ఎగిసి కాలితో తన్నతా వేంది? అయినా నాకు దెలవకడు గుతా. మేమంతా అమ్మేసిం తర్వాత మద్దెన వున్న నీ పొలానికి నీళ్ళెట్టా వొత్తయ్యనుకుంటున్నావ్? ఒకేళ వాన్లకి నాబేసినా మురుగు నీరు

ఎటు పంపిత్తావ్?" వీరన్న ప్రశ్నల వర్షాన్ని అడ్డుకుంటూ, "ఆయన భూమి, ఆయనిష్టం. వదిలెయ్ వీరన్నా." అన్నాడు ప్రభాకర్.

తన పదేళ్ల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇలాంటి వాళ్లెందరినో చూసాడు ప్రభాకర్. కొంతమంది 'తాతల నాటి ఆస్తి' వంటి సెంటిమెంట్లతో అమ్మకానికి ఒప్పుకోకపోతే, మరికొంతమంది ఇంకొంత కాలం ఆగితే మంచి రేటు వస్తుందని వెంటనే అమ్మకానికి పెట్టరు. ఒక్కోసారి ఇలాంటి వారిని కార్నర్ చేయడానికి, వీళ్ల పొలం చుట్టూ వున్న పొలాల్ని కూడా అవసరం లేకపోయినా కొనాల్సి వుంటుంది.

ఆ విధంగా నాలుగు వైపులు నుంచి దిగ్బంధనం చేస్తే ఎంతలావు మగాడైనా కొండదిగిరాక తప్పదు. కాకపోతే కొంతకాలం ఓపిగ్గా వెయిట్ చెయ్యక తప్పదు. కానీ అదేమి చిత్రమో! ఈ సిన్నోడి పొలాన్ని తనకి తెలియకుండానే కార్నర్ చెయ్యడం జరిగింది.

❊ ❊ ❊ ❊ ❊

మరుసటి రోజు పొలానికెళ్ళిన సిన్నోడికి కళ్ళు తిరిగినంత పనయ్యింది. ఆ పట్నపోడు తను కొన్న పొలాల చుట్టూ కంచె వేయిస్తున్నాడు. అతను కొన్న పొలాల మధ్య వున్న 'తన పొలానికి' నడవడానికి దారి కావాలంటే అతడు పెట్టబోతున్న గేటే శరణ్యం. ఏం చేయాలో పాలుపోని సిన్నోడు పరుగు పరుగున వెళ్ళి పంచాయితీ ప్రెసిడెంటు దగ్గర మొరపెట్టుకున్నాడు.

"ఒరే సిన్నోడా, నీకెందుకురా అంత పంతం." అంటూ సిన్నోడిని నాలుగు తిట్లు తిట్టి, ప్రభాకర్‌ని పిలిపించి, "ఎంతైనా మా ఊరోడు. కాస్త చూసీ చూడనట్టు పోవాలి మరి" అని సర్ది చెప్పి, మనిషి నడిచేంత బాటని ఇప్పించాడు పంచాయితీ ప్రెసిడెంటు. ఇవాళ కాకపోయినా రేపైనా సిన్నోడు తనకి పొలం అమ్మక తప్పదని గట్టిగా నమ్మిన ప్రభాకర్ మారు మాట్లాడకుండా మనిషి నడిచేందుకు సరిపోయే బాట వదలి చుట్టు ప్రక్కల కంచె వేయించేందుకు ఒప్పుకున్నాడు.

"నా కడుపు కక్కుర్తేందో నాకు తెల్సు. పంతం.. గింతం అంటాడేంది పెసిడెంటు? ఆయనకేం! పదెకరాలు అమ్మినా తొంబై ఎకరాలున్నాయి. నాకేముంది? నేలమన్ను.. పొయ్యిలో బూడిద." మనసులోని మాటల్ని పెదవి దాటనీయకుండా ఇంటికి చేరుకున్నాడు సిన్నోడు.

నాలుగు రోజుల తర్వాత దుక్కి దున్నడానికి దున్నకుర్రలను పొలం తోలుకపోయాడు. కానీ, మనిషి మాత్రమే నడిచేందుకు వీలుగా వున్న ఆ కంచె బాటలో ముందుకు సాగమని దున్నకుర్రలు మొరాయించాయి.

దూరంగా ఈ చోద్యం చూస్తున్న ప్రభాకర్‌కి సిన్నోడు తనకి పొలం అమ్మేరోజు ఎంతో దూరంలో లేదనిపించింది. వెంటనే అతని ముఖంపై ఓ విజయహాసం వెల్లి విరిసింది. అతని నవ్వుని చూసి రెచ్చిపోయిన సిన్నోడు, ఎన్నడూ కొట్టి ఎరుగని తన దున్న కుర్రలను ఎడాపెడా బాదడం మొదలెట్టేడు. భీతిల్లిన దున్న కుర్రలు ఒక్కసారిగా ఇంటిముఖం పట్టి పరుగు లంకించుకున్నాయి. అంతే! ఊరు ఊరంతా సిన్నోడిని చూసి పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుకుంది.

ఎలాగోలా పొలాన్ని పారతో తిరగేసి, వానలు కురిసిన వెంటనే నాటు వేయించాలని కూలి మనుషులని పిలిస్తే, "పొలంలో సరిగా నీళ్ళు లేవు. నీ పొలం నాటేసేలోపు మా వేళ్లిరుగుతాయి. గసికలతో నాటడం మా వల్ల గాదు." అని ముఖం మీదే చెప్పేసారు.

చివరికి చేసేది లేక ఇంట్లో వాళ్లందర్నీ పొలంలోకి దింపి 'నాటు' అయిందనిపించాడు. కానీ అంతలోనే బండలు పగిలే బెట్ట తీయడంతో నాటంతా విలవిలలాడుతూ మాడిపోయింది. సిన్నోడి సేద్యం ఊరి జనానికి మంచి కాలక్షేపమయ్యింది.

ఈలోపు ఇంట్లో వాళ్ల నుంచి కూడా సిన్నోడికి ప్రతిఘటనలు ఎదురయ్యాయి. "గుదిబండలా తయారైన ఆ ఏడెకరాల దిబ్బతో పాకులాడటం కంటే, ఎంతో కొంతకి ఆ పట్నపోడికే అమ్మేయడం మంచిద"ని ఇన్నేళ్లూ తన మాటకి పల్లెత్తు మాట కూడా ఎదురు చెప్పి ఎరుగని భార్య సతాయించడం ప్రారంభించింది.

"ఆ దరిద్రపు పొలం అమ్మి నా ఉద్యోగానికి లంచం కట్టండి. సంవత్సరంలో అంతకంటే రెట్టింపు సంపాయిస్తాను." అంటూ పెద్ద కొడుకు మరో వైపు నుంచి పోరు ప్రాంభించాడు.

చివరికి ఓ నిర్ణయినికొచ్చిన వాడిలా 'ఏడెకరాల దిబ్బ' వైపు నడక సాగించాడు సిన్నోడు.

❊ ❊ ❊ ❊ ❊

ఏడెకరాల దిబ్బ చేరుకున్న సిన్నోడికి, ఎప్పుడూ ఏదో ఒక పనులు చేయిస్తూ వుండే ప్రభాకర్ కన్పించలేదు. ఇంతలో ఓ పెద్ద మనిషి "ఏమోయ్! వెంకట సుబ్బయ్యా, ఎలా వున్నావ్?" అంటూ పలకరించడంతో సిన్నోడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

తన అసలు పేరేమిటనేది, తనే మరిచిపోతున్న తరుణంలో "ఈ కొత్త మడిసికి నా పేరెట్టా తెలిసిందబ్బా?!" అని దీర్ఘాలోచనలో పడ్డాడు సిన్నోడు.

"ఓర్నీ, నన్నింకా గుర్తు పట్టలా? నేను, పరంధామయ్య మేస్టారు గారబ్బాయిని. నలభై ఏళ్ల క్రితం ఈ ఊరి బళ్లో చదువుకుంటూ నీతోపాటూ అల్లరి చిల్లరిగా తిరిగేవాడిని గుర్తుందా? మా నాన్న నిన్ను బడికి ఈడ్చుకురమ్మని పిల్లల్నందరినీ పంపిస్తే గొడ్డు తోలుకుని అడవికి పారిపోయావే.. అవన్నీ మర్చిపోయావా? సుందరం... సుందరం.. గుర్తుకు రావడంలే!" ఆ ఆగంతకుని వాక్ప్రవాహం వరదలా సాగిపోతోంది.

సిన్నోడి జ్ఞాపకాల దొంతర్లలో కదిలికలు. కాసేపటికి అతని ముఖం విచ్చుకుంది.. అవును సుందరం బాబు. పరంధామయ్య మేస్టారు గారబ్బాయి. సెలవు రోజుల్లో తనతో పాటూ చెట్లెంట, పుట్లెంట తిరిగేవాడు. కొన్నాళ్లకి మేస్టారుగారికి బదలాయింపు రావడంతో ఊరు వదలి వెళ్లి పోయారు. ఆ రోజు తను కూడా సుందరాన్ని తాడితోపుకి తీసుకెళ్లి కడుపునిండుగా తాటి ముంజెలు తినిపించినట్లు గుర్తు!

"సుందరం బాబు! బాగున్నారండీ?"

"ఓర్నీ, చొక్కాలో గుండీల్లా మధ్యలో ఈ 'అండీలు' ఎందుకో? అన్నట్టు ప్రభాకర్ మా అబ్బాయే! మావాడు తన బిజినెస్ ఎక్స్‌పాండ్ చేస్తున్నట్లు చెప్తున్నప్పుడు మధ్యలో మన ఊరి పేరు వినబడ్డంతో, ఓసారి మిమ్మల్నందరినీ చూసినట్లుంటుందని ఇక్కడి కొచ్చిన నాకు పెద్ద షాక్! చిన్నప్పుడు మనం ఆడుతూ పాడుతూ తిరిగిన పంటపొలాలనన్నింటిని మావాడు ప్లాట్స్‌గా మారుస్తున్నాడు. మన పెద్దోళ్లు 'నల్ల బంగారం' అంటూ మురిసిన ఈ మాగాణి పొలాల్ని ప్లాట్స్ వేయడానికి వీల్లేదని చెప్పాను. నువ్వు కూడా నీ పొలాన్ని అమ్మకానికి పెట్టనని చెప్పావటగా?"

"లేదు బాబూ! నా పొలాన్ని అబ్బాయిగారికే ఎంతోకొంత రేటుకి ఇచ్చేద్దామని వొచ్చాను." ఏదో తప్పు చేసిన వాడిలా తలొంచుకుని చెప్పాడు సిన్నోడు.

"వ్వాట్?!" అరిచినంత పని చేసాడు ప్రభాకర్ తండ్రి.

"అవును బాబూ! మా పెద్దోడి ఉజ్జోగం కోసం.. పొలాన్ని అమ్మేయక తప్పడం లేదు."

"ఇకపై మీవాడి ఉద్యోగం గురించి దిగులు పడొద్దు. మీవాడికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత నాది. ఏమంటావ్?"

"మీ మేలు మరిచిపోలేను బాబూ."

"అమ్మా నాన్న పోయాక ఏమీ లేని వాడిగా మిగిలిపోయాను. తర్వాత సంసార బంధంలో పడి, ఆ తర్వాత పిల్లలందరినీ ప్రయోజకులుగా తీర్చిదిద్దేంతవరకూ ఆరాటం. ఈ గొడవల్లో నాకు తెలియకుండానే రిటైర్మెంట్ వయసు వచ్చేసింది. రెన్నెళ్ల క్రితం డిప్యూటీ కలెక్టర్‌గా రిటైరైనాను. కాని ఏదో వెలితి. ఇంతలో అనుకోని విధంగా ఇటు వచ్చిన నాకు పాత స్మృతులన్నీ, తిరిగి ఓ కొత్త స్ఫూర్తినిస్తున్నాయి. ఈ భూముల్ని చూసిన తర్వాత రైతుగా నా శేష జీవితాన్ని ఇక్కడే గడపాలనిపించింది. ఏదో నీలాంటివాడు తోడుగా నిలిస్తే, వ్యవసాయాన్ని ఓపట్టు పడదామని వుంది. అందుకే ఈ భూముల్ని ప్లాట్స్ చేయడానికి వీల్లేదని ప్రభాకర్‌కి చెప్పాను. కావాలంటే తనకి ఇప్పటి వరకు అయిన ఖర్చు ఇస్తానని చెప్పాను." ప్రభాకర్ తండ్రి మాట సిన్నోడి హృదయంపై పన్నీటి జల్లులు కురిపించాయి.

"తమరి లాంటోళ్ల వల్లనే మన తెలుగుగడ్డ అన్నపూర్ణమ్మగా కలకాలం వర్ధిల్లుతుంది బాబూ." సిన్నోడి చక్షువులు ఆనందాశ్రువులు పుష్పించాయి.

"ఆ మాట నీకు సరిపోతుంది సిన్నోడా! అన్నట్టు మావాడు టౌన్‌కి వెళ్లాడు. నిన్ననే సిమెంట్‌కి ఆర్డరిచ్చాడట. ప్రస్తుతానికి సిమెంట్ అవసరం లేదని చెప్పిరావడానికెళ్లాడు. రేపొద్దున్నే వచ్చావంటే పొలం పనులు మొదలెడదాం మరి." అని చెప్పి కాలువ గట్టు వైపు సాగిపోయాడు ప్రభాకర్ తండ్రి.

ఈ శుభవార్తని తన వాళ్లకి చెప్పేందుకు వడివడిగా ఇంటికి చేరిన సిన్నోడికి పంచలో చిన్న కొడుకు ఎదురొచ్చాడు. వాడి ముఖం వెయ్యివాట్ల బల్బులా వెలిగిపోతోంది,

"నాన్నోవ్.. మన కోడిపెట్ట గుడ్డు పెట్టింది." ❑